# సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆవిర్భావం – వికాసం

1820వ సంవత్సరంలో ఓ వెలుగు శిఖరం మన కడప గడపలో అడుగుపెట్టింది. అగ్గిపురుగులకి ఆహుతైపోతూన్న మన తెలుగు సాహిత్యాన్ని కాపాడడానికి నడుం కట్టింది. సాహిత్యాన్ని పునర్లిఖించడానికి నాంది పలికింది. ఆ వెలుగు శిఖరమే ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్. చెదలు పట్టిన తాళపత్రాలను సేకరించి పండితులతో పరిష్కరింపించి, పరిశీలింపించి, శుద్ధ ప్రతులను తయారు చేయించి, సాహిత్య దీపాన్ని వెలిగించారు. బ్రౌన్ బంగళాలోని తోటకు నీరు పెట్టి, కాపలా కాసే అయోధ్యాపురం కృష్ణారెడ్డి, బ్రౌన్ చేసే ఖర్చుల వివరాలను రాసేవాడు. అలాగే కడప జిల్లాలోని అనేక ప్రాంతాలు తిరిగి తాళపత్ర గ్రంథాలు సేకరించి, శుద్ధప్రతులను తయారు చేయడంలో అటు పండితులకి, ఇటు బ్రౌన్ దొరకి అనుసంధానం చేసేవాడు. తోటకి నీరు పెట్టడమే కాదు తెలుగు సాహిత్య తోటలో విరబూసే సాహిత్య పద్మాలను కాపాడిన వాడు, బ్రౌన్ కు కుడిభుజం లాంటి అయోధ్యాపురం కృష్ణారెడ్డి, సాహితీ యోధునిగా పనిచేశారు. కొన్ని రోజులకు బ్రౌన్ నివసించిన బంగళా శిథిలమైపోయింది.

1976లో కడప జిల్లా రచయితల సంఘం ఓ సాహిత్య కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బంగోరె, ఆచార్య జి.ఎన్. రెడ్డి, ఆరుద్ర మొదలైన ప్రముఖులు వచ్చారు. బంగోరె, ఆచార్య జి.ఎన్. రెడ్డి, ఆరుద్ర, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి కలిసి శిథిలమైన బంగళాను పరిశీలించి, బ్రౌన్ నివసించి, సాహిత్య సేద్యం చేసిన స్థలంగా గుర్తించారు. అదే ప్రదేశంలో బ్రౌన్ స్మృతి చిహ్నంగా ఏదైనా నిర్మించాలని, ఇక్కడి పెద్దలకు సూచించారు. ఆ సూచన ఫలితమే ఇప్పుడు మీరు, చదువుకుంటున్న గ్రంథాలయ నిర్మాణం. అదే సి.పి. బ్రౌన్ పరిశోధన కేంద్రంగా, తరువాత రూపురేఖలు మార్చుకుని ఉన్నతిని సాధించింది.

1977లో మొండి గోడలుగా మిగిలి ఉన్న స్థలాన్ని (సుమారు 20 సెంట్ల స్థలాన్ని) బ్రౌన్ స్మృతి చిహ్నంగా భావించారు. ఈ స్థలం అంతకు మునుపు ప్రముఖ ఆడిటర్ సి.ఆర్. కృష్ణస్వామి గారు, కోర్టు వేలం పాటలో రెండు వేల రూపాయలకు కొన్నారు. విరాళంగా, బ్రౌన్ కు గుర్తుగా ఆ స్థలాన్ని ఇమ్మని కలెక్టర్ గారు కోరడంతో కృష్ణస్వామి గారు అంగీకరించారు.

1978 నుండి 1985 వరకు గ్రంథాలయ నిర్మాణంలో కొంత స్తబ్దత ఏర్పడింది. తాత్కాలిక సభ్యులుగా విధులు నిర్వహిస్తున్న కొంతమంది ప్రముఖులు, సేకరించిన స్థలంలో నాలుగుస్తంభాల మంటపంగా కట్టి, సి.పి. బ్రౌన్ గారి విగ్రహాన్ని ఆ మంటపంలో నిలబెట్టాలని, ఈ నిర్మాణానికి జిల్లా పరిషత్తు సహకరించి, నిధులు ఇవ్వాలని, ప్రయత్నాలు చేశారు. కాని వారి ప్రయత్నాలు ఫలవంతం కాలేదు.

1986 వ సంవత్సరంలో తాత్కాలిక సి.పి. బ్రౌన్ మెమోరియల్ ట్రస్ట్ గా ఉన్న కమిటి రిజిస్ట్రేషన్ విషయాలు మాట్లాడుకునేందుకు సి.కె. సంపత్ కుమార్ అధ్యక్షతన 23.3.1986న సమావేశమై, "సి.పి. బ్రౌన్ – సి.ఆర్. కృష్ణ స్వామి మెమోరియల్ లైబ్రరి బిల్డింగ్ & రీసెర్చ్ సెంటర్" పేరుతో

రిజిస్ట్రేషన్ చేయించాలని కమిటీ తీర్మానించింది. ఈ సంవత్సరంలో మొత్తం మూడుసార్లు కమిటీ సమావేశమై వివిధ తీర్మానాలు చేసింది.

1987లో జంధ్యాల హరినారాయణ గారు కడపకి కలెక్టర్ గా వచ్చి, ఇదే సంవత్సరంలో సి.పి. బ్రౌన్ మెమోరియల్ ట్రస్ట్ రిజిస్టర్ చేశారు. ట్రస్ట్ ప్రధాన పోషకునిగా కలెక్టర్ గారు, అధ్యక్షులుగా సి.కె. సంపత్ కుమార్ గారు, ఉపాధ్యక్షులుగా జి. కృష్ణమూర్తి గారు, పసుపులేటి బ్రహ్మయ్య గారు, కార్యదర్శిగా జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారు, సంయుక్త కార్యదర్శిగా జె.సి.సుబ్బయ్యగారు, కోశాధికారిగా ఎం. జానకిరాం గారు, సభ్యులుగా జూటూరు రమణయ్య శ్రేష్ఠి గారు, పి.సాంబ శివయ్యగారు, డా॥ ఎం. కృష్ణమూర్తి రావు గారు, ఎ. సాయికుమార్ గారు మొదలైన వారు బాధ్యతలు తీసుకొని, కార్యాచరణ ప్రణాళిక, అభివృద్ధి దిశగా ముందడుగు వేశారు. ఈ దశలోనే 22.1.1987న గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన జరిగింది. ఈ సంవత్సరంలో ట్రస్ట్ కమిటీ నాలుగు సార్లు సమావేశమై వివిధ తీర్మానాలు చేసింది.

జానమద్ది వారు ట్రస్ట్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి, బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధి కోసం 1వ తరగతి విద్యార్థి నుండి ముఖ్యమంత్రి స్థాయివరకు ఉన్న వ్యక్తులందరిని కలిసి, ఆర్థికపరమైన చేయూతను, అధికారిక అనుమతులను, నైతిక మద్దతును కూడగట్టుకుంటూ, ప్రేరణ కలిగిస్తూ వచ్చారు. సాహితీకార్యక్రమాలను చేస్తూ, సాహితీవేత్తలకు, బ్రౌన్ గురించి తెలియచేస్తూ, అధికారులను, రాజకీయనాయకులను కలిసి, బ్రౌన్ గ్రంథాలయాన్ని, పరిశోధన కేంద్రంగా విశ్వవిద్యాలయానికి అప్పచెప్పేంత వరకు, అవిరళంగా కృషి చేసి 'బ్రౌన్ శాస్త్రి'గా మారారు. తెలుగు సాహిత్యాన్ని బ్రౌన్ వెలుగులోకి తీసుకు వస్తే, బ్రౌన్ ను సామాన్య పాఠక ప్రపంచానికి, సాహితీవేత్తల మనోఫలకాలపై నిలిపినవారు జానమద్ది వారు.

జానమద్ది వారు బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణానికి చేపట్టిన పనులను, పత్రికల ద్వారా తెలుసుకున్న మధ్యప్రదేశ్ బస్తర్ లో పనిచేస్తున్న తెలుగు కార్మికుడైన డి.వి. ప్రసాదరావు తన వంతుగా 10 రూపాయలు విరాళం పంపాడు. అంత గొప్ప ప్రేరకుడు జానమద్దివారు. అలాంటి గొప్ప సాహితీకృషీవలుని ద్వారా బ్రౌన్ గ్రంథాలయం దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది.

6.11.1988న సి.కె. సంపత్ కుమార్ గారి ఆధ్వర్యంలో కమిటీ సమావేశమై బ్రౌన్ గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తి చేయుట గురించి, విద్యుదీకరణ, పరిశోధనా పరికరాలు, మైక్రోఫిల్మ్, ఫోటోస్టాట్ – తదితరాలను కొనుగోలు చేయుటకు 6.5 లక్షలు మంజూరు కోరుతూ ప్రభుత్వానికి విన్నవిస్తూ లేఖ రాసి, 14.11.1988న ముఖ్యమంత్రి గారికి స్వయంగా ఇచ్చేట్టుగా ప్రణాళిక చేశారు.

30.3.1989న సి.కె. సంపత్ కుమార్ గారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రంథాలయ భవన ప్రారంభ ప్రత్యేక సంచిక వెలువరించుటకు తీర్మానించారు.

1990లో ఎ.కె. ఫరీడా గారు కడప కలెక్టర్గా వచ్చారు. కడప జిల్లా అక్షరాస్యతా కార్యక్రమానికి బ్రౌన్ గ్రంథాలయంలో శ్రీకారం చుట్టారు. కలెక్టర్ గారి అధ్యక్షతన గాంధీ జయంతి సంఘ సమావేశం

జరిగింది. సంఘం నిధుల నుండి కలెక్టరు గారు 60 వేల రూపాయలు మంజూరు చేశారు.

ఈ సంవత్సరంలో కీలక మలుపుగా చెప్పుకోవాల్సిన సంఘటన ఒకటి జరిగింది. ప్రభుత్వానికి సంబంధించిన అక్షరరశ్మి కార్యాలయం ఇప్పటి జిల్లా పరిషత్ ఆవరణంలో ఉండినది. బుగ్గవంకకు నీళ్ళు రావటంతో అక్షరరశ్మి కార్యాలయంలోని ఫైల్స్, పుస్తకాలు పాడైపోతాయన్న ఉద్దేశ్యంతో, సుమారు నాలుగు బండ్ల సామగ్రిని బ్రౌన్ కార్యాలయానికి తరలించవలసిందిగా కలెక్టర్ గారి ఆదేశం. ఈ విషయం శాస్త్రి గారికి తెలిసి, గ్రంథాలయ భవనం శాశ్వత ప్రభుత్వ అక్షరరశ్మి కార్యాలయంగా మారిపోతుందేమోనన్న భయంతో, నాలుగు బండ్లలో తరలిస్తున్న సామగ్రిని అడ్డుకొని వెనక్కి పంపించేశారు. ఈ సందర్భంలో వల్లూరులోని పోలేపల్లి వెంగన్న శ్రేష్ఠి (ఈ పెద్దాయన వల్లూరులో తన స్వంత ఇంట్లో 2,500 పుస్తకాలతో శ్రీ సీతారామచంద్ర గ్రంథ భాండాగారం నిర్వహించేవారు. శాస్త్రిగారి దగ్గరికి వచ్చి, "నా పుస్తకాలు మీ గ్రంథాలయానికి విరాళంగా ఇస్తాను" అని మధ్య, మధ్యలో వచ్చి అడిగి వెళ్ళేవారట) గారిని సంప్రదించి వెంటనే మీ పుస్తకాలను గ్రంథాలయానికి పంపించవలసిందిగా కోరారు. వెంటనే పుస్తకాలన్నీ తెచ్చివ్వటంతో 'గ్రంథాలయం' 'అయః ముహూర్తః సుమూహూర్తః' అన్నట్టుగా ప్రారంభమైంది.

1991లో మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యంగారు బ్రౌన్ ఊహాచిత్రాన్ని గీసి పాఠకుల, అభిమానుల గుండెల్లో ముద్రవేశారు. అంతవరకు బ్రౌన్ ముఖకవళికలను ఊహించని పరిస్థితి. శాస్త్రి గారిని మైనంపాటి వారు 1990లో కడప ఆకాశవాణి ప్రోగ్రాంకు వచ్చినప్పుడు కలిశారు. ఈ సందర్భంగా బ్రౌన్ చిత్ర పటాన్ని అమరిస్తేనే లైబ్రరీకి సంపూర్ణత చేకూరుతుందని, అందుకు మైనంపాటి వారు బ్రౌన్ చిత్రాన్ని గీస్తే బాగుంటుందని సూచన చేశారు. 1990 జూన్లో మొదలుపెట్టి 1991 సెప్టెంబరు 19వ తేదీకి బ్రౌన్ తైలవర్ణ చిత్రాన్ని పూర్తి చేశారు. ఈ చిత్రాన్ని బ్రౌన్ తండ్రి డేవిడ్ బ్రౌన్ (1763–1812) ఆధారంగా చిత్రించారు.

1992వ సంవత్సరం నుండి గ్రంథాలయం సేవలు విస్తృతమయ్యాయి. రాజారామమోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్, కలకత్తా వారు గ్రంథాలయ అభివృద్ధి కోసం 30 వేల రూపాయలు పంపించగా, దీన్ని గ్రంథాలయ ఫర్నీచర్ కోసం, పుస్తకాల కోసం వినియోగించారు.

1993వ సంవత్సరంలో జిల్లా కలెక్టర్ పి.సుబ్రహ్మణ్యం గారి అధ్యక్షతన మెమోరియల్ ట్రస్ట్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయాన్ని తెలుగు విశ్వవిద్యాలయం వారు, పూర్తి యోగ్యతలు గల సిబ్బందితో భాషా పరిశోధనా కేంద్రంగా అభివృద్ధి చేయుటకుగాను దత్తత తీసుకొను విషయం గురించి ఆలోచించ వలసిందిగా తీర్మానించారు.

1994వ సంవత్సరంలో కె.వి. రమణాచారిగారు కలెక్టర్గా వచ్చారు. గ్రంథాలయ ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్నారు. రమణాచారి గారు ప్రభుత్వ విద్యాకార్యదర్శి శ్రీధరశర్మ గారితో మాట్లాడి గ్రంథాలయ నిర్వహణకు ఆర్థికంగా తోడ్పడమని కోరడంతో, అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.

జయభారత రెడ్డి గారు 5 లక్షల రూపాయలు, రమణాచారి గారు మరో లక్ష రూపాయలు ఇచ్చి గ్రంథాలయానికి మరింత ఊపిరి పోశారు.

29.11.1995న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥ చంద్రబాబు నాయుడు గారు ట్రస్ట్ వారి విన్నపాన్ని మన్నించి, గ్రంథాలయ భవనాన్ని తెలుగు జాతికి అంకితం చేశారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు డా॥ వావిలాల గోపాలకృష్ణయ్య, రాష్ట్ర మంత్రులు కోడెల శివప్రసాదరావు, ఎస్.వి. సుబ్బారెడ్డి, బి.వీరారెడ్డి, కలెక్టరు వీణా ఈష్ గార్లు గ్రంథాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. వావిలాల వారిచే ముఖ్యమంత్రిగారు గ్రంథాలయాన్ని ప్రారంభింపజేశారు. ఇదే సంవత్సరంలో జానమద్ది హనుమచ్ఛాస్త్రి మరియు ఎం. జానకిరాం గార్ల సంపాదకత్వంలో సి.పి. బ్రౌన్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "సి.పి.బ్రౌన్ గ్రంథాలయ భవన ప్రారంభోత్సవ విశేష సంచిక'ను ముద్రించారు.

1996లో ఇన్‌ఛార్జి కలెక్టరుగా ఉన్న ఎ. గిరిధర్ గారు జానమద్ది వారిని పిలిపించి, గ్రంథాలయంపై సమావేశ మందిరాన్ని నిర్మించడానికి 2,50,000 రూపాయలు మంజూరు చేశారు. ఆ డబ్బుతో గ్రంథాలయం మొదటి అంతస్తులో సమావేశమందిరం పూర్తైంది. తరువాత కలెక్టరుగా వచ్చిన వి. నాగిరెడ్డిగారు మరో లక్ష రూపాయలు మంజూరు చేయగా మొదటి అంతస్తులో పరిశోధకుల గదుల నిర్మాణం పూర్తైంది.

23.05. 1997న బ్రౌన్ మెమోరియల్ ట్రస్ట్ కార్యవర్గం సమావేశమై గ్రంథాలయానికి విలువైన పుస్తకాలను కానుకగా ఇచ్చిన దాతలకు సన్మానం చేశారు. వీరిలో మహాత్మాగాంధీ రచనల 100 సంపుటాలను విరాళంగా ఇచ్చిన గడియారం రామకృష్ణ శర్మ గారికి, 410 పుస్తకాలతోపాటు, పుస్తకాలు భద్రపరచటానికి స్టీల్ ర్యాకు విరాళంగా ఇచ్చిన శ్రీమతి రుక్మిణీ కృష్ణమూర్తి గారికి కృతజ్ఞతలు తెలిపారు

1998 ప్రత్యేక సంవత్సరం. బ్రౌన్ జన్మించి 200 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా 'ద్విశతజయంతి' ఉత్సవాలను నిర్వహించడం, ప్రత్యేక సంచిక తీసుకురావటం, నవంబరులో ప్రముఖ తెలుగు సాహితీవేత్తలచే, సాహిత్య సదస్సుల నిర్వహణ, బాలల గ్రంథాలయ ఏర్పాటు మొదలైన ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. 1999లో బ్రౌన్ 201వ జయంతిని పురస్కరించుకొని, బ్రౌన్ స్మారక సాహిత్యోపన్యాసాలను ఏర్పాటు చేశారు. కళాశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గ్రంథాలయం పట్ల ఆసక్తి కలగడానికి, వివిధ రకాల పోటీలు (వ్యాస, వక్తృత్వ, క్విజ్) నిర్వహించటం మొదలు పెట్టారు.

2000వ సంవత్సరంలో గ్రంథాలయ అభివృద్ధికి రాష్ట్రస్థాయి సలహా సంఘం ఏర్పాటు చేశారు. ఇందులో రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల అధ్యక్షుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు, సి. రామచంద్రయ్య ఎం.పి. గారు, యస్.రామమునిరెడ్డి ఎం.పి. గారు, శ్రీ కె.వి. రమణాచారి కలెక్టరు గారు, జె. హరినారాయణ గారు, డా॥ పి.ఎల్. సంజీవరెడ్డి గారు, చుక్కపల్లి పిచ్చయ్య గారు మొదలైన ప్రముఖులున్నారు. ఇదే సంవత్సరంలోనే ఆచార్య బిరుదురాజు రామరాజు గారు గ్రంథాలయానికి 2500 అపురూప గ్రంథాలను బహూకరించారు.

2001లో నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా, జనపథ్, న్యూఢిల్లీ వారు ప్రాచీన తాళపత్ర ప్రతులు భద్రపరచుటకు, ప్రాచీన గ్రంథాలు వెలుగులోకి తీసుకురావటానికి, 80 వేల రూపాయలు నిధులు సమకూర్చి గ్రంథాలయ ప్రాచీనతను, మరింత గుర్తింపులోకి తీసుకువచ్చారు.

2002వ సంవత్సరంలో బ్రౌన్ గ్రంథాలయం పుట్టినప్పటి నుండి, అన్ని విధాల సహకరిస్తూ, బాధ్యతలను పూర్తిగా మోస్తూ, ప్రతి కార్యక్రమంలోను అధ్యక్షత వహిస్తూ, సభ్యులకు సూచనలు చేస్తూ, ముందుకు నడిపిన సి.కె. సంపత్ కుమార్ గారు కాలధర్మం చెందారు. తర్వాత గ్రంథాలయ ట్రస్ట్ కి అధ్యక్షునిగా జి. కృష్ణమూర్తిగారు బాధ్యతలు స్వీకరించారు. ఇదే సంవత్సరంలోనే శాస్త్రిగారికి సహాయకులుగా స్వచ్ఛందంగా కట్టా నరసింహులు గారు వ్యవహరించారు. కడప జిల్లా మెకంజీ కైఫియత్తుల మొదటి సంపుటం ప్రచురించారు.

2003లో శాస్త్రి గారికి గ్రంథాలయం రెండవ అంతస్తులో భాషా పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తే బాగుంటుందని కట్టా వారు సలహా ఇచ్చారు. ఈ సలహాతో ఆయన డా॥ సి. నారాయణరెడ్డి గారిని సంప్రదించగా వారు తమ రాజ్యసభ నిధుల నుండి 10 లక్షల రూపాయలు మంజూరు చేశారు. డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి గారు ఈ నిధుల మంజూరు విషయంలో మాట్లాడి 5 లక్షల నుండి 10 లక్షల రూపాయలకు పెంచుటకు కారకులయ్యారు. దీనికి కృతజ్ఞతగా 'జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి పరిశోధన కేంద్రం'గా ఆ భవనానికి పేరు పెట్టి 9.10.2003న నారాయణరెడ్డి గారి చేతుల మీదుగా రెండవ అంతస్తును ప్రారంభించారు.

2004లో బొంబాయిలో నున్న ఎక్సెల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ గట్టు నారాయణగారు బ్రౌను ట్రస్టు రెండు లక్షల రూపాయలు విరాళమిచ్చి, అత్యవసర పరిస్థితుల్లో ఆదుకున్నారు. కడప జిల్లా అభివృద్ధికి ఉద్దేశింపబడిన మాస్టర్ ప్లాన్లో భాగంగా సి.పి. బ్రౌన్ గ్రంథాలయాన్ని ప్రాంతీయ సాహిత్య, శాస్త్ర పరిశోధనా కేంద్రంగా అభివృద్ధి పరచుటకు తగిన ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్ గారికి పంపారు.

2005లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో డా॥ వై.ఎస్. రాజశేఖరరెడ్డి గారు సందర్శించారు. గ్రంథాలయ ఆవరణలో బ్రౌన్ కుడ్య చిత్రాన్ని ఆవిష్కరించారు. 15 లక్షల రూపాయల వార్షిక గ్రాంట్ ను మంజూరు చేశారు. 1.10.2005 నుండి బ్రౌన్ గ్రంథాలయాన్ని 'శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అప్పగిస్తున్నట్లు' ట్రస్ట్ ప్రకటించింది. ట్రస్ట్ సేకరించిన 22 లక్షల రూపాయలను, 30 వేలకు పైగా పుస్తకాలను శాస్త్రిగారు విశ్వవిద్యాలయానికి అప్పగించారు. 1.10.2005 నుండి బ్రౌన్ గ్రంథాలయం 'సి.పి. బ్రౌన్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాంతీయ తెలుగు భాషా సాహిత్యాల పరిశోధన కేంద్రంగా' పేరు మార్చుకుంది.

2006 జనవరిలో కైఫియత్తుల 2వ సంపుటం, ఆగష్టులో 3వ సంపుటం వచ్చాయి. 2006 మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్వీ యూనివర్సిటీ పి.జి. సెంటర్ స్థానంలో యోగి వేమన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసింది. స్పెషల్ ఆఫీసర్ గా ఉన్న ఆచార్య జి. శివారెడ్డి గారు ఈ గ్రంథాలయాన్ని చూసి అన్ని

విధాల సహకరిస్తామని చెప్పి, తరువాత 1.11.2006వ తేదీన గ్రంథాలయాన్ని 'సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం'గా నామకరణం చేసి యోగి వేమన విశ్వవిద్యాలయానికి అనుబంధ సంస్థగా కలుపుకున్నారు.

2007వ సంవత్సరంలో సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, యోగి వేమన విశ్వవిద్యాలయంలోని తెలుగు విభాగం, సంయుక్తంగా నిర్వహించిన వేమన తత్వంపై జాతీయ సదస్సు వేమన్నను విభిన్న దృక్కోణంలో ఆవిష్కరించింది. ఇందులో చాలామంది ప్రముఖులు పాల్గొని, వేమన భాషా సాహిత్యం , మహిళలపట్ల వేమన, తులనాత్మక పరిశీలన, సమాజపరివర్తన, తాత్విక ధోరణులు అన్న అంశాలపై పత్రసమర్పణ చేశారు. 2006–2007వ సంవత్సరంలో మెకంజీ కైఫియత్తులు 4వ సంపుటం వెలువడింది.

2008లో బ్రౌన్ పరిశోధన కేంద్రానికి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ, ప్రాచ్యపరిశోధనా సంస్థ డైరెక్టర్ ఆచార్య వేమూరి వెంకటరమణారెడ్డి గారు సభ్యులుగా పనిచేశారు. ఈ సంవత్సరంలో "కడప జిల్లా సాహిత్యం , చరిత్ర" అన్న విజ్ఞాన సర్వస్వాన్ని భవిష్యత్తులో పుస్తకంగా తీసుకురావడానికి తీర్మానం చేయడంతో నాంది పడింది. ఈ పుస్తకం త్వరలో మన ముందుకు రాబోతుంది. ఈ విజ్ఞాన సర్వస్వం విశ్వవిద్యాలయానికి, సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి శాశ్వత కీర్తిని సంపాదిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. 2007–2008వ సంవత్సరానికి గాను అప్పట్లో సి.పి. బ్రౌన్ మెమోరియల్ ట్రస్ట్ ప్రచురించిన కైఫియత్తుల మొదటి సంపుటం పునర్ముద్రణ పొందింది. భాషా పరిశోధన కేంద్రం పేరుతో ప్రచురిస్తున్న కైఫియత్తుల 5వ సంపుటం ముద్రితమైంది. ప్రముఖ రచయిత, ప్రస్తుత అధికార భాషా సంఘం అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారు, బ్రౌన్ పరిశోధన కేంద్రాన్ని దర్శించి "తన జీవితంలో ఈ అవకాశం చిరస్మరణీయమైనదిగా" గుర్తుంచుకుంటాను అని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు గ్రంథాలయాన్ని దర్శించి "సి.పి. బ్రౌన్ ఆత్మ ఆవేశించి గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి పథంలోకి నడిపించాలని" కోరుకున్నారు.

2009లో వేమన జయంతిని పురస్కరించుకొని, రెండురోజుల సదస్సు నిర్వహించి వేమన పునర్మూల్యాంకనాన్ని చేపట్టింది. ఈ సదస్సు కోసం 50 వేల రూపాయలు నిధులు ఖర్చు చేసింది. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం, బ్రౌన్ పరిశోధన కేంద్రం సంయుక్త నిర్వహణలో ఫిబ్రవరి 11, 12 తేదీలలో అన్నమయ్య సాహిత్యంపై సదస్సు నిర్వహించింది. ఈ సంవత్సరంలో కడప ఆకాశవాణి పూర్వసంచాలకులు డా॥ ఆర్. అనంత పద్మనాభరావు గారు, అప్పట్లో బ్రౌన్ గ్రంథాలయంలో బాధ్యులుగా విధులు నిర్వహిస్తున్న కట్టావారి గురించి "కట్టా నరసింహులు, పరిశోధనా నరసింహుడై ఈ సంస్థ ప్రగతికి, మరో అడుగు వేయడానికి దోహదపడుతున్నారు" అని శ్లాఘించారు.

2010లో పి.ఎల్. సంజీవరెడ్డి, ఐ.ఎ.ఎస్.గారు తెలుగు విశ్వవిద్యాలయ రంగస్థల కళల శాఖాధిపతి పెద్ది రామారావు గారు, ఎ.ఎస్. గుర్రప్ప గారు, విశ్రాంత ఐపిఎస్ అధికారి, అప్పజోడు వేంకట సుబ్బయ్య గారు గ్రంథాలయాన్ని దర్శించారు. తెలుగు భాషా సాహిత్యాల కోసం, గ్రంథాలయ

ఉద్యోగులు, యోగి వేమన విశ్వవిద్యాలయ అధికారులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ దిశగా ముందడుగు వేసి మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నారు.

2011 డిసెంబరులో పుట్టపర్తి నారాయణాచార్యుల పై జాతీయ సదస్సు జరిగింది. డిసెంబరు 13, 14 తేదీలలో లలిత కళానికేతతో కలిసి "తెలుగు నాటకం – నాటక రంగం" అనే అంశం మీద రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. 7.12.2011న రచన సాహిత్య వేదిక కడపవారు, గడియారం శేషశాస్త్రి సాహిత్య అవార్డును ఈ వేదిక నుండే అందించి, వేంకటశేషశాస్త్రి ప్రతిభను ప్రజలకు, సాహిత్య అభిమానులకు తెలపడం, బ్రౌన్ నిర్వహించిన సాహితీ యజ్ఞానికి కొనసాగింపుగా అభివర్ణించవచ్చు. 27.06.2011 నుండి ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు, పరిశోధన కేంద్ర బాధ్యతను చేపట్టారు. ఈ సంవత్సరంలోనే ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు, శాస్త్రిగారి ఆలోచనలకు అనుగుణంగా, సాహితీ ప్రచారం కూడా బ్రౌన్ గ్రంథాలయ ఉద్దేశ్యాలలో ఒకటిగా ఉన్నదని గుర్తించి తదనుగుణంగా ఈ సంవత్సరంలో 23.10.2011న "నెలనెలా మనజిల్లా సాహిత్యం " అన్న కార్యక్రమాన్ని ప్రారంభించడం గ్రంథాలయ చరిత్రలో నూతన అధ్యాయంగా భావించవచ్చు. ఈ కార్యక్రమం సాహిత్య అభిమానులను, ఉపన్యాసకులను, విమర్శకులను తయారు చేసిందనడంలో ఎటువంటి సందేహం లేదు. మొట్టమొదటి ఉపన్యాసంగా "సంకుసాల నృసింహకవిపై" ఆచార్య గల్లా చలపతిగారు ప్రసంగించారు.

2012 నవంబర్ లో కల్నల్ మెకంజీ కైఫియత్తులు 6వ సంపుటం వెలువడింది. సెప్టెంబరు 10 నుండి 14 వరకు కేంద్ర సాంస్కృతిక శాఖకు చెందిన నేషనల్ మిషన్ ఫర్ మాన్యుస్క్రిప్ట్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థలతో కలిసి "తాళపత్ర గ్రంథాల సేకరణ, సంరక్షణ" అనే అంశంపై 5 రోజుల నేషనల్ వర్క్ షాపు నిర్వహించారు. ఈ వర్క్ షాపులో 24 మంది శిక్షణ తీసుకొని, మన తాళపత్రాలను ఎలా సంరక్షించుకోవాలి అన్న అంశంపై అవగాహన పెంచుకున్నారు.

19.2.2012న డా॥ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్, కడప వారు భూతపురివారి 76వ జయంతిని, స్మారక పురస్కార ప్రదానాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్ని ప్రత్యేక కార్యక్రమాలకు సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం వేదిక అవడం గౌరవంగా భావించాలి.

2013–14లో 'వేమన' పై రెండు పరిశోధనా పుస్తకాలు, సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, యోగి వేమన విశ్వవిద్యాలయం, సంయుక్తంగా సదస్సులు నిర్వహించి పుస్తకాలు వెలువరించింది. వేమన–1, వేమన–2, బ్రౌన్ పై విమర్శ వ్యాసాలు ప్రచురించింది. 2014లో కైఫియత్తుల 7వ సంపుటం వెలువరించింది. ఈ సంవత్సరంలోనే ప్రముఖ నటులు, రచయితలు, తనికెళ్ళ భరణి, గొల్లపూడి మారుతీరావులు గ్రంథాలయాన్ని దర్శించారు. తెలుగువాళ్ళ దేవాలయంగా భరణి గారు అభివర్ణిస్తే, బ్రౌన్ కృషిని చిరస్థాయిగా చేసి, ముందు తరాలకు సాధికారికంగా అందించగలిగే అద్భుతమైన కృషి బాధ్యతాయుతంగా సాగడం ఎంతో ఆనందదాయకం అని మారుతీరావు గారు అభినందించారు. ఉన్నత న్యాయస్థానానికి న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ బి. చంద్రకుమార్ గారు గ్రంథాలయ బాధ్యులు చేస్తున్న కృషికి తగిన గుర్తింపు త్వరలోనే తప్పక వస్తుందని ఆశించారు. అరసం రాష్ట్ర అధ్యక్షులు

పెనుగొండ లక్ష్మీనారాయణగారు “మనం ఈ జ్ఞాననిధి పురోగతికి పాటుపడదాం. అరసం అందుకు సహకరిస్తుంది” అని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం మరియు పరిశోధనాలయం డైరెక్టర్‌గా ఉన్న శ్రీపాద సుబ్రహ్మణ్యం గారు “జాతీయ స్థాయిలోనే గాక, అంతర్జాతీయ స్థాయిలో ప్రాముఖ్యాన్ని పొందిన ఈ లైబ్రరీని సందర్శించడం మా గౌరవంగా భావిస్తున్నానని, ఈ గ్రంథాలయాన్ని దర్శించడం, ఎంతో సంతృప్తిని కలిగించిందని” అన్నారు.

28.2.2014న డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారు కాలధర్మం చెందడంతో, సాహిత్యలోకానికి, బ్రౌన్ గ్రంథాలయానికి తీరని లోటు ఏర్పడింది.

జానమద్ది చేసిన కృషి నిరంతరం కొనసాగడానికి, ఆయన జ్ఞాపకాలను, సేవలను స్మరించుకుంటూ, మనం కృషి చేయవలసిన అవసరం ఉంది. 20.4.2014న డా॥ పి. సంజీవమ్మ, డా॥ తక్కోలు మాచిరెడ్డి గార్లు ఇచ్చిన లక్షల రూపాయల నిధితో ‘అభ్యుదయ సాహిత్యోపన్యాసాలు’ కార్యక్రమ ప్రారంభ సదస్సు జరిగింది.

2015లో సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం అప్రతిహతంగా నిర్వహిస్తున్న “నెల నెలా మన జిల్లా సాహిత్యం” 50 నెలలు పూర్తి చేసుకుంది. కీ.శే. డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారి ప్రథమ వర్ధంతి, (1.3.2015) సందర్భంగా “బ్రౌన్ శాస్త్రీయం” ప్రత్యేక సంచికను తీసుకొచ్చారు. ఇందులో జానమద్ది వారి జీవిత విశేషాలు మొదలుకొని బ్రౌన్ గ్రంథాలయం కోసం చేసిన కృషిని, వారి సాహిత్యాన్ని విశ్లేషించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థాన న్యాయమూర్తి సి.వి. నాగార్జున రెడ్డి గారు “తెలుగు చరిత్రను, సంస్కృతిని తెలియచేసి, ఎన్నో పుస్తకాలను సేకరించి, భద్రపరచబడిన, ఈ గ్రంథాలయం ఒక విజ్ఞాన భాండాగారము” అని మెచ్చుకున్నారు. అనివార్య కారణాల వలన 27.06.2011 నుండి 30.06.2015 వరకు బాధ్యులుగా ఉన్న ఆచార్య రాచపాలెంవారు, ఆచార్య టి. వాసంతి గారికి బాధ్యతలను అప్పచెప్పారు. వాసంతి గారు 01.07.2015 నుండి 10.09.2015 వరకు, ఆ తర్వాత డా॥ వై. నజీర్ అహ్మద్ గారు 11.09.2015 నుండి 10.12.2015 వరకు, 11.12.2015 నుండి 14.06.2017 వరకు గ్రంథాలయ బాధ్యులుగా డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి గారు విధులు నిర్వహించారు. ఈ సంవత్సరంలోనే ప్రముఖ గ్రంథాలయ సేవకులు చంద్రశేఖర కల్కూర గారు గ్రంథాలయాన్ని సందర్శించారు. 12.12.2015న మహాత్మాగాంధీ మనుమడు రాజమోహన్ గాంధీ గ్రంథాలయాన్ని సందర్శించారు. “ఆంగ్లేయుడైన సి.పి. బ్రౌన్ యొక్క తెలుగుదనమూ, భారతీయతా, విశ్వాత్మతా, ప్రేమపూర్వక కార్యశీలతా వెరసి ఈ పవిత్ర స్థలముగా ఏర్పడి, భావితరాలకు సుందరోద్యానముగా విలసిల్లుతోంది. ఈ బృహత్కార్య నిర్వాహకులైన వారికీ, జానమద్ది హనుమచ్ఛాస్త్రి వంటి మహనీయులకు ఈ ప్రదేశంలోనే కృతజ్ఞతలర్పించడం నాకెంతో గర్వ కారణం” అని రాజమోహన్ గాంధీ గారు అభినందించారు. ఇంతవరకు బ్రౌన్ గ్రంథాలయం ప్రచురించిన “కల్నల్ మెకంజీ కైఫియత్తులు” 7 సంపుటాలుగా వచ్చాయి. ఈ ఏడు సంపుటాలలో 2,716 పుటలున్నాయి. త్వరలోనే 8వ సంపుటం కూడా వస్తుంది.

08.05.2016న డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి గారు "తెలుగు పాఠశాల" అన్న వైవిధ్యభరితమైన కార్యక్రమాన్ని చేపట్టి, తెలుగు భాష గొప్పదనాన్ని, ముఖ్యంగా నేటి విద్యార్థులకు అవగాహన కల్పించే దిశగా ముందడుగు వేశారు. ఈ కార్యక్రమం 18.09.2016 వరకు, దాదాపు 20 వారాలు, పలువురు అధ్యాపకుల, సాహితీవేత్తల సహకారంతో, ప్రతి ఆదివారం ఉదయం పూట జరుపుతూ కొత్త ఒరవడికి నాంది పలికారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. 10.11.2016న సి.పి. బ్రౌన్ 218వ జయంతి సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీతో కలిసి "సి.పి. బ్రౌన్ సేవ – సమకాలీన ప్రాసంగికత" అనే అంశంపై సదస్సును నిర్వహించారు. బ్రౌన్ పై విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించిన తొలి సదస్సు ఇదే కావడం విశేషంగా చెప్పవచ్చు.

నేషనల్ మిషన్ ఫర్ మాన్యుస్క్రిప్ట్, న్యూఢిల్లీ మరియు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రాచ్యపరిశోధన సంస్థలతో కలిసి 'రాతప్రతులు సంరక్షణ' గురించి 05.12.2016 నుండి 09.12.2016 వరకు 5 రోజుల జాతీయ కార్యశాల నిర్వహించి, బ్రౌన్ గ్రంథాలయ చరిత్రలో, దక్షిణ భారతదేశ స్థాయిలో, అందరికీ మన గ్రంథాలయం గురించి తెలియచేశారు. దక్షిణ భారతదేశ స్థాయిలో వివిధ పరిశోధకులు, పలువురు అధ్యాపకులు పాల్గొనడం ఇందులో విశేషం.

2017లో "70 ఏళ్ళ భారత స్వాతంత్ర్యం – తెలుగు కవిత్వం" అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. మార్చి 4వ తేది డాబబ పి. సంజీవమ్మ, డా॥ తక్కోలు మాచిరెడ్డి గార్లు ఇచ్చిన లక్ష రూపాయల నిధితో నిర్వహిస్తున్న అభ్యుదయ సాహిత్యోపన్యాసాలలో భాగంగా "అభ్యుదయ సాహిత్యం – దళితవాద దృక్పథం" అనే అంశంపై పెనుగొండ లక్ష్మీనారాయణ గారు ప్రసంగించారు.

జానమద్ది వారి తృతీయవర్ధంతిని ఫిబ్రవరి 28న నిర్వహించి, పి. సుబ్బరాయ కవి, ఎమ్. జానకిరామ్ గార్లతో జానమద్ది వారిపై స్మారక ఉపన్యాసాలు ఇప్పించారు. 14.06.2017న ఎన్. ఈశ్వరరెడ్డి గారు విధుల నుండి నిష్క్రమించడంతో డాబబ మూల మల్లికార్జున రెడ్డి గారు బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యతలను 15.06.2017 నుండి చేపట్టారు. ఇక్కడ నుండి బ్రౌన్ గ్రంథాలయ భాషా పరిశోధన కేంద్రం కీలక మలుపులతో, అనేక పుస్తకాల ప్రచురణలతో మరింత ముందుకు అభివృద్ధి దిశగా పరుగులు తీస్తూంది. సి.పి. బ్రౌన్ వర్ధంతిని పురస్కరించుకొని 05.12.2017 నుండి 12.12.2017 వరకు వారంపాటు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ప్రాచీన వ్రాత ప్రతులను చదవడం వంటి అంశాలపై పోటీలను నిర్వహించారు.

28.02.2018న తూమాటి సంజీవరావు గారు, జానమద్ది వారి నాల్గవ వర్ధంతి సందర్భంగా స్మారకోపన్యాసం చేశారు. 19.08.2018న 'అలపర్తి పిచ్చయ్య చౌదరి జీవితం – సాహిత్యం ' అన్న అంశంపై చివరి ప్రసంగం తర్వాత "నెలనెలా మనజిల్లా సాహిత్యం " అన్న పేరు మార్పు జరిగింది. 30.09.2018 నుండి "నెలనెలా సీమ సాహిత్యం " అన్న పేరుతో డా॥ అప్పిరెడ్డి హరినాథ రెడ్డి గారు "పప్పూరు రామాచార్యులు జీవితం – సాహిత్యం " అన్న ప్రసంగంతో సాహిత్య ప్రసంగాల పరిధి సీమ

స్థాయికి పెరిగింది. ఈ ప్రసంగానికి మునుపే అంటే 07.05.2018న "రాయలసీమ అధ్యయన విభాగం" అన్న పేరుతో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. దీనికి మూలకారకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి గారు, ప్రస్తుతం బాధ్యులుగా ఉన్న డా॥ మూల మల్లికార్జున రెడ్డి గారు, మేధావులు, విమర్శకులు, పాఠకుల ఆలోచనల మేరకు విశ్వవిద్యాలయ అధికారులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకొని, సీమ సాహిత్యంపై ప్రత్యేక అధ్యయనం జరగాలన్న దృష్టితో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు.

ఇదే సంవత్సరంలో ప్రఖ్యాత శాస్త్రవేత్త, హైదరాబాద్ సెంటర్ ఫర్ మాలిక్యులర్ బయాలజీ విశ్రాంత సంచాలకులు, సి. హెచ్. మోహనరావు గారు, తెలంగాణా సాహిత్య అకాడమీ అధ్యక్షులు ఆచార్య నందినీ సిద్ధారెడ్డి గారు, తెలుగు రక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు హరికృష్ణ గారు, ఉమ్మడి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వేంకట శేషసాయి గారు, సంగీత అవధాని డా॥ మీగడ రామలింగస్వామి గారు, బ్రౌన్ గ్రంథాలయాన్ని దర్శించి, అభివృద్ధిని కాంక్షించారు. బ్రౌన్ గ్రంథాలయ రీసెర్చ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డా॥ చింతకుంట శివారెడ్డి గార్ల సేవ హర్షించదగినది. వీరు రాయలసీమ నుండి వచ్చిన కొన్ని నవలల్ని, కథానికల్ని, అధ్యయనం చేసి దాదాపు 2 వేల స్థానిక పదాలను సేకరించి 'రాయలసీమ పద లఘు కోశం' తీసుకొచ్చారు.

12.11.2018న సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రత్యేక సంచిక, రాయలసీమ పద లఘు కోశం, నెలనెలా మన జిల్లా సాహిత్యం (విమర్శ వ్యాసాలు) – అన్న మూడు పుస్తకాలు, బ్రౌన్ 220వ జయంతి సందర్భంగా ఆవిష్కరించుకొని, గ్రంథాలయం పరిశోధనా పుస్తకాలకు అగ్రస్థానమిస్తుందని నిరూపించింది. సి.పి.బ్రౌన్ వర్ధంతి సందర్భంగా 06.12.2018 నుంచి 12.12.2018 వరకు 7 రోజుల పాటు, గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా, నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాల విద్యార్థులకు కథా పూరణం, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, పద్యపఠనం వంటి పలురకాల పోటీలు నిర్వహించారు.

2018 జూన్లో బ్రౌన్ పరిశోధన కేంద్రానికి "బ్రౌన్'కు సంబంధించిన కొన్ని అరుదైన పుస్తకాలు సేకరించటంలో బాధ్యులు డా॥ మూల మల్లికార్జునరెడ్డి గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య మేడిపల్లి రవికుమార్ గారి సహకారంతో, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి లిటరరీ ఆటోబయోగ్రఫీ ఆఫ్ సి.పి. బ్రౌన్, ఓల్డ్ రికార్డ్ ఆఫ్ కడప డిస్ట్రిక్ట్, మాన్యువల్ ఆఫ్ ది అడ్మినిస్ట్రేషన్ మద్రాస్ ప్రెసిడెన్సీ, ది పోర్ట్ ఆఫ్ జార్జి గెజిట్, ది వర్సస్ ఆఫ్ వేమన, కంపారిటివ్ ప్రాసడి ఆఫ్ ద్రవిడియన్ లాగ్వేంజెస్ – లాంటి అత్యంత అరుదైన పుస్తకాల ప్రతులను, బ్రౌన్ గ్రంథాలయానికి చేర్పించటం ఓ అరుదైన ఘట్టంగా చెప్పవచ్చు.

2019లో జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారి 5వ వర్ధంతి సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ విశ్రాంత తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య శలాక రఘునాథ శర్మగారు చేసిన స్మారకోపన్యాసం అందరినీ

అలరించింది. రాయలసీమ సాహిత్య అధ్యయనంలో భాగంగా 13.04.2019న వై.ఎస్.ఆర్. జిల్లాకు చెందిన నన్నెచోడుడు, నాచన సోముడు, అల్లసాని పెద్దన అనే మూడు విమర్శ వ్యాసాలను, 29.09.2019న వినుకొండ వల్లభరాయుడు, తాళ్ళపాక అన్నమయ్య, పోతులూరి వీరబ్రహ్మం అనే మరో మూడు విమర్శ వ్యాస సంకలనాలను ఆవిష్కరించారు. ఈ సంవత్సరంలో మరో ప్రత్యేక కార్యక్రమం విద్యార్థుల నుండి, వృద్ధుల వరకు అందరికీ ఉపయోగపడే "వై.ఎస్.ఆర్. కడప జిల్లా విజ్ఞాన దర్శిని" (బిట్ బ్యాంక్) పుస్తకం ఒక సంచలనం. కడప ప్రజలు ప్రతి ఒక్కరు చదవాల్సిన అవసరం ఉంది. మన జిల్లా గురించి, అనేక విషయాలు ఇందులో ఉండడంతో అన్ని వర్గాల మన్ననలు పొందుతోంది. పరిశోధన కేంద్రం డిజిటలైజేషన్ దిశగా పరుగులు తీస్తూంది. తాళపత్ర గ్రంథాల సేకరణ జరుగుతూంది.

2020 సంవత్సరం రజతోత్సవ సంవత్సరం. కరోనాతో అనేక కార్యక్రమాలు స్తంభించిన సంవత్సరం. ఇలాంటి విపత్కర పరిస్థితులలో కూడా కొన్ని కొత్త నిర్ణయాలు తీసుకుంది సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం. 09.01.2020న శతాధిక కవిసమ్మేళనం, బాధ్యులుగా ఉన్న మూల మల్లికార్జున రెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. 28.01.2020న కొత్తగా ఏర్పడిన సలహామండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా కడప జిల్లా కలెక్టర్ గారు పాల్గొన్నారు.

24.02.2020న "నెలనెలా సీమ సాహిత్యం" నూరవ సదస్సు జరిగింది. ఈ సదస్సులో రాచపాళెంవారు "శ్రీకృష్ణదేవరాయలు జీవితం – సాహిత్యం" గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య మునగాల సూర్యకళావతి గారు ముఖ్య అతిథిగా విచ్చేసి, 100 సదస్సులు పూర్తి చేసుకున్నందుకు, గర్వంగాను, సాహిత్య కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరుగుతున్నందుకు అభినందనలు తెలిపారు. 12.03.2020న గ్రంథాలయంలో "ఒంటిమిట్ట రాములోరి చరిత్ర" లఘుచిత్రంలో భాగంగా "పోతన భాగవత" సందర్భ ఘట్టాన్ని గ్రంథాలయంలో చిత్రించటం అన్నది గ్రంథాలయ చరిత్రలో మరువలేని విషయంగా చెప్పవచ్చు. 30.05.2020న విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మునగాల సూర్యకళావతి గారి ఆధ్వర్యంలో తాళ్ళపాక తిమ్మక్క అయ్యలరాజు రామభద్రుడు, బమ్మెర పోతన, రామరాజభూషణుడు నాలుగు విమర్శ పుస్తకాలు ఆవిష్కరింపబడ్డాయి.

ఈ కార్యక్రమంలోనే రెక్టార్‌గా పనిచేస్తూండిన గౌరవనీయులు ఎం. రామకృష్ణారెడ్డి గారి పదవీ విరమణ సన్మాన సభకూడా నిర్వహించి, వీరు గ్రంథాలయానికి సహకరించిన విధానాన్ని బాధ్యులు, సిబ్బంది జ్ఞాపకం చేసుకున్నారు. 30.06.2020న సలహామండలి సమావేశంలో "సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్ర రజతోత్సవ కార్యక్రమాల" గురించి నిర్ణయం తీసుకున్నారు. 05.08.2020న మళ్ళీ సలహామండలి సమావేశమై రజతోత్సవాల ప్రణాళికను సిద్ధం చేసింది. నవంబరులో రజతోత్సవాలు నిర్వహించి, గ్రంథాలయాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళి, ప్రజలకు మరింత చేరువయ్యేలా, కార్యక్రమాలను చెయ్యాలని తీర్మానించి విజయవంతం చేసింది. రాయప్రోలు సుబ్బారావు, కందుకూరి వీరేశలింగం పంతులు, టంగుటూరి ప్రకాశం పంతులు, వై.ఎస్. రాజశేఖరరెడ్డి, ఎన్.సి. రామసుబ్బారెడ్డి గార్ల జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తూ వారి సేవలను ప్రజలకు తెలియపరుస్తూ, సాహిత్యాన్ని

అందరికి పంచుతూ ముందుకు దూసుకు వెళుతోంది.

అనంతరం 2021లో వేమన పద్యాలు (వ్యాఖ్యానం : ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి), వేమన పద్యాలు(ముడుమాల సిద్ధయ్యగారి ప్రతి; పరిష్కరణ : విద్వాన్ కట్టా నరసింహులు), మనిషీ నీకసాధ్యమేది! బాపూ కవితా చిత్రణం(ఆంగ్లమూలం : బదరీనారాయణ్ సిన్హా; అనువాదం : డా.జానమద్ది హనుమచ్ఛాస్త్రి, విద్వాన్ కట్టా నరసింహులు) వేమన పద్యాలు(1839 సం॥లో బ్రౌన్ ప్రచురించిన తెలుగు ఎడిషన్ రెండవ ముద్రణ ఆధారంగా), మాసీమ కవులు(డా.జానమద్ది హనుమచ్ఛాస్త్రి), బ్రౌన్ లేఖలు(మొదటి సంపుటం), 2022లో వైయస్సార్ కడపజిల్లా చరిత్ర పుస్తకాలను భాషా పరిశోధన కేంద్రం వెలువరించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ వై.యస్.జగన్మోహన్ రెడ్డి గారు 9.7.2021న సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో ఏర్పాటుచేసిన బ్రౌన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున 5.5 కోట్ల రూపాయలను స్థల సేకరణ, నూతన భవన నిర్మాణానికి కేటాయించి, శంకుస్థాపనకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మునగల సూర్య కళావతి గారు, కులసచివులు ఆచార్య దుర్భాక విజయరాఘవ ప్రసాద్ గారు, భాషా పరిశోధన కేంద్రం బాధ్యులు డా॥ మూల మల్లికార్జున రెడ్డి గారు, విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు, పరిశోధన కేంద్ర సలహాసంఘం సభ్యులు, భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రం నిర్వహిస్తున్న భాషా సాహిత్యాల కృషిని ప్రశంశిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2021 సంవత్సరానికి గానూ 'జీవిత సాఫల్య పురస్కారాన్ని' అందజేసింది. ఈ పురస్కారంతోపాటు రూ.10,0000(పది లక్షల రూపాయలు) రివార్డు కూడా అందజేశారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ గౌరవనీయులు బిశ్వభూషన్ హరిచందన్, రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి గారి చేతుల మీదుగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మునగల సూర్య కళావతి గారు అందుకున్నారు.

03-11-2022లో గ్రంథాలయ ప్రాంగణంలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ స్థలదాత శ్రీ సి.కె.సంపత్ కుమార్ గారి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మునగల సూర్య కళావతి గారు, కులసచివులు ఆచార్య దుర్భాక విజయరాఘవ ప్రసాద్ గారు, భాషా పరిశోధన కేంద్రం బాధ్యులు డా॥ మూల మల్లికార్జున రెడ్డి గారు, గ్రంథాలయ సిబ్బంది, సంపత్ కుమార్ గారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సి.పి.భాషా పరిశోధన కేంద్రంలో యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఛైర్మన్‌గా, కులసచివులు మెంబర్ సెక్రెటరిగా, ఒక సంచాలకులు, పది మంది సిబ్బంది బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

వివిధ పరిశోధనలతో, వేల పొత్తాలతో, వందల సదస్సులతో, వందల సందర్శకులతో, పదుల

కార్యశాలలతో, పొత్తాల నిలయం, పరిశోధనల ఆలయం అలరారుతోంది. ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకుంటోంది. పేరుకు పాతిక సంవత్సరాలే అయినా, ఈ కృషికి 1820వ సం॥ ఆగస్టు నుండి బీజం పడిందనే చెప్పాలి. 1820 నుండి 1822 వరకు, 1825 నుండి 1828 వరకు, ఆ తర్వాత 148 సంవత్సరాలకు అంటే 1976లో మళ్ళీ, బ్రౌన్ వేసిన బీజం మొక్కగా మొలకెత్తి 1987లో పెరిగి పెద్దదై, వివిధ శాఖోపశాఖలుగా విస్తరించి 1995 నాటికి, ఒక స్థిరమైన పొత్తాల చెట్టుగా రూపుదిద్దుకొని అప్పటి నుండి మంచి ఫలాలను అందిస్తున్నది. ఈ యజ్ఞంలో ఎంతోమంది తమ శ్రమను, మేధను, ఆలోచనలను, ఆచరణలను ప్రవేశపెట్టి వై.ఎస్.ఆర్. కడప జిల్లాను ఒక ప్రత్యేక శిఖరాన నిలబెట్టారు.

గ్రంథాలయంలోని పుస్తకాలను ఇంటికి తీసుకెళ్ళి చదువుకునే అవకాశం ఉంది. అందుకు రూ. 500 (ఐదు వందల రూపాయలు) కట్టి శాశ్వత సభ్యత్వం పొందవచ్చు.